క్లుప్తంగా

ఆరోగ్యసూత్రాలు పాటించాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి

కణేకల్లు: విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని కేజీబీవీలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడారు. రోజువారి జీవితంలో సరైన పరిశుభ్రత పాటిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. చిన్నప్పటి నుండి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటి సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తగినంత నీరు తాగాలని, రక్తహీనత సమస్య ఉంటే ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కేజీబీవీ ఎస్ఓ మంజుళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించినప్పుడే గుర్తింపు



తహసీల్దార్ మునివేలును సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బొమ్మనహాళ్: రైతు, ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించినప్పుడే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ మునివేలు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది తహసీల్దార్‌ను సన్మానించారు. డీటీ శ్యామ్, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, సుజాత, నాగరాజ్‌స్వామి, రామన్న, యుగంధర్, శృతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీతాలు మంజూరు చేయాలి

బొమ్మనహాళ్: వెలుగు సంస్థలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల (వీఓఏ)కు పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతాలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, యానిమేటర్ల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని వీఓఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలియజేశారు. తహసీల్దార్ మునివేలుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ నాయకులు ఓబులేసు, వీఓఏలు శీన, సునీత, రాజశేఖర్, వీరేష్ పాల్గొన్నారు.

110 బస్తాల బియ్యం వితరణ

కణేకల్లు: కర్ణాటకలోని గదగ్ జిల్లా శివశాంతవీర మఠంకు కణేకల్లుకు చెందిన భక్తులు 110 బియ్యం బస్తాలు (50 కేజీలు) వితరణ ఇచ్చారు. ఈ మఠం ఆధ్వర్యంలో అంధుల పాఠశాల, నిరుపేద విద్యార్థుల వసతి గృహం ఉందని భక్తులు వేలూరు మరియప్ప, పీవీ రెడ్డి, బసవరాజు స్వామి, శాంతమూర్తి తెలిపారు. ఫిబ్రవరి 4న జాతర జరగనుందన్నారు.

డిపాజిట్ స్కీమ్‌లు సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: ఏపీజీబీలో ఆకర్షణీయమైన అధిక వడ్డీ ఇచ్చే డిపాజిట్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచి మేనేజర్ గజపతి రెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో బ్యాంకు పథకాలపై మాట్లాడారు. ఏపీజీబీ డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ లభిస్తుందన్నారు. ప్రగతి త్రివేణి పేరిట 333 రోజుల కాల వ్యవధికి,సాధారణ ఖాతాదారులకు 7.25 శాతం వడ్డీ, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.20 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. ప్రగతి కుబేర్ పేరిట 444 రోజుల కాల వ్యవధికి సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.30 శాతం, సాధారణ ఖాతాదారులకు 7.50 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో ప్రగతి సిరి గోల్డ్ కింద రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా రుణం పొందొచ్చన్నారు. పీఎంసూర్యఘర్ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్‌కు రూ.78 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు.

సూక్ష్మ సేద్య పరికరాలు సద్వినియోగం చేసుకోండి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న పీడీ రఘునాథరెడ్డి

ఉరవకొండ: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న సూక్ష్మసేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీ ఎంఐపీ అధికారులు, సూక్ష్మసేద్య కంపెనీల జిల్లా కోఆర్డినేటర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 2,905 మంది రైతుల పొలాలను క్షేత్ర స్థాయిలో ప్రాథమిక పరిశీలించినట్లు తెలిపారు. 977 మంది రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ సూక్ష్మసేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ రైతుల పొలాలన్నీ పరిశీలిస్తామన్నారు. ఈనెల 30న ఏపీ సూక్ష్మ సేద్య పథకం ద్వారా పరికరాలు పంపిణీ ఉంటుందన్నారు. ఉద్యానవన శాఖ అధికారి నెట్టి కంతయ్య, మండల ఇంజనీర్ కరుణ, ఎంఐఏఓ శ్రీరాములు, సూక్ష్మసేద్య కంపెనీ జిల్లా కోఆర్డినేటర్లు, డీలర్లు పాల్గొన్నారు.



తల్లికి వందనం.. పిల్లలకు ద్రోహం



- హామీకి తిలోదకాలిస్తున్న వైనం
- పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15 వేలు ఇస్తానన్న చంద్రబాబు
- ఇప్పటికీ అతీగతీలేని వైనం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న తల్లులు

కళ్యాణదుర్గం: ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే 'చంద్రబాబు చెప్పేదొకటి.. అమలు మరొకటి అన్నట్లుంది'.. సార్వత్రిక ఎన్నికల సమయంలో 'తల్లికి వందనం' పేరిట పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15వేలు చొప్పున అందజేస్తామన్నారు.. అధికారంలోకొచ్చిన తర్వాత మాట మారుస్తూ ప్రజలను వంచించడానికి సిద్ధమయ్యారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఒక్కో తల్లికి రూ.15వేలు చొప్పున మాత్రమే ఇస్తామని చెప్పడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అధికారంలోకి రావాలని ఆశ చూపి.. అధికారం చేపట్టిన తర్వాత తిలోకదకాలు ఇవ్వడం చంద్రబాబు నైజమని సర్వత్రా విమర్శిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 269 మొత్తం పాఠశాలలు ఉన్నాయి. అందులో 35,535 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు 35,535 మందికి 'తల్లికి వందనం' వర్తింపజేయాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఎంత మందిని చదివిస్తున్న ఇంట్లో ఒక్కరికే పథకం వర్తిస్తుందని నిబంధన పెట్టడంతో తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తాజా జీఓ ప్రకారం తల్లికి వందనం పథకం లబ్ధిదారుల్లో భారీగా కోత పడనుంది.

గతంలో అమ్మఒడి కింద ఏటా రూ.77.72 కోట్లు ఖర్చు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. కులం, మతం, వర్గం పార్టీ చూడకుండా జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా సకాలంలో తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసేవారు. దీనికి తోడు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు, జగనన్న విద్యా కానుక, విదేశీ విద్యా దీవెన తదితర అనేక పథకాలు క్యాలెండర్ ప్రకారం అమలు చేసేవారు. పాఠశాలలు తెరిచే సమయానికే ఒక్క అమ్మఒడి పథకం ద్వారానే నియోజకవర్గ వ్యాప్తంగా ఏటా 27,923 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.77.72 కోట్లు జమ చేసేవారు. విద్యా దీవెన పథకంలో 24,082 మంది ఇంటర్ విద్యార్థులకు ఏటా రూ.41.67 కోట్లు అందజేశారు. జగనన్న వసతి దీవెన కింద 22,543 మంది విద్యార్థులకు రూ.21.24 కోట్లు అందించారు. ఇలాంటి పథకాలను పక్కాగా అమలు చేయడంతో తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారం పడేది కాదు.

పేదలను ఇలా వంచించారు...



సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలిచ్చారు. కుటుంబంలో బడికి వెళ్లే విద్యార్థులందరికీ ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో ఆర్థిక ఆసరా కల్పిస్తానని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్లేట్ ఫిరాయించారు. 'తల్లికి వందనం మాట అటుంచితే తల్లికి ద్రోహం' చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. పథకం అమలుకు సవాలక్ష నిబంధనలు విధిస్తూ కోత విధించేందుకు శ్రీకారం చుట్టారు. పిల్లలందరికీ ఇస్తామని నాడు చెప్పగా నేడు కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా ఒక్క తల్లికి మాత్రమే ఏటా రూ.15 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం ఒక్క విద్యార్థికి మాత్రమే ప్రభుత్వం తల్లికి వందనం ఆర్థిక సాయం అందించనుంది. దీనికి తోడు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు 75 శాతం హాజరు ఉండాలన్న నిబంధన పెట్టారు. అన్ని వర్గాలకు కాకుండా దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న తల్లులకు మాత్రమే ఇస్తామంటూ మెలిక పెట్టారు. దీనిపై మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

స్కూళ్లు తెరవకముందే డబ్బులు పడేవి



మా పాప కళ్యాణదుర్గంలోని గోల్డెన్ బెల్స్ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా స్కూళ్లు తెరవక ముందే అమ్మఒడి పథకం నగదు మా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇంత వరకూ నగదు జమ కాలేదు.

– రోజా, విద్యార్థిని తల్లి, మల్లాపురం

అందరికీ వర్తింపజేయాలి



పేద పిల్లలకు మంచి భవిష్యత్ అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకంను అందరికీ వర్తింపజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇంట్లో కేవలం ఒక్కరికి మాత్రమే తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పడం సరైంది కాదు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని గెలిచిన తర్వాత కూడా అమలు చేయాలి. – హనుమంతరాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రాణాలు పోయేదాకా స్పందించరా..?



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: 'సార్.. పదే పదే ఫిర్యాదు చేస్తున్నా పెడ చెవిన పెడుతున్నారు.. ప్రాణాలు పోయేదాకా పట్టించుకోరా?' అని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొమ్మయ్య, యువజన నాయకుడు బీమేష్ తదితరులు తహసీల్దార్ బాలకిషన్‌ను నిలదీశారు. కంబదూరు – కళ్యాణదుర్గం ప్రధాన రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేట్ టెలికాం సంస్థ తవ్వకాలు చేపట్టడంతో తరచూ స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. తవ్వకాలు నిలిపివేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ టెలికాం సంస్థ తవ్వకాలు చేపట్టినా పట్టించుకోలేదని ఇప్పటికే రోడ్డు ప్రమాదాలకు గురై గాయపడ్డారన్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు, తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తహసీల్దార్ స్పందించి ఆర్అండ్‌బీ జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అండేపల్లి రామాంజనేయులు, మల్లూరి వెంకటేశులు, విల్సన్, వెంకటప్ప, కిరణ్, రాజు, హరీష్, రఘునాథ్‌రెడ్డి, రామాంజి పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపీటీసీల నిరసన



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

కణేకల్లు: 'సార్... మేము కూడా ప్రజాప్రతినిధులనేది మీకు గుర్తుందా? ? మాపై ఎందుకంత వివక్ష చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఎంపీడీఓ శ్రీనివాసులును నిలదీశారు. గ్రామాల్లో సభలు నిర్వహిస్తే కనీసం సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్ కూడా పాటించడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ లీలావతి ఛాంబర్‌లో ఎంపీటీసీ సభ్యులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రాధాన్యత ఉన్న పనులు చేయమని చెప్పినా పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్‌తో పనుల కోసం ప్రతిపాదనలు పెడితే తీర్మానాలు చేయబోమని ఖరాఖండిగా చెప్పేశారు. 15వ ఆర్థిక సంఘం కింద పనులను టీడీపీ నేతలు కూడా అడుగుతున్నారని, అందరూ ఏకాభిప్రాయంతో వస్తే పనులు చేయడానికి వీలవుతోందని ఎంపీడీఓ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను చిన్నచూపు చూస్తే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

కుందుర్పి, కళ్యాణదుర్గం కొండలకు నిప్పు



జంబుగుంపల వద్ద కాలిపోతున్న అడవి

కుందుర్పి/కళ్యాణదుర్గం రూరల్: కుందుర్పి మండలంలోని జంబుగుంపల అడవి రెండు రోజులుగా కాలిపోతోంది. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు మల్లికార్జునకొండ ప్రాంతంలో నిప్పు పెట్టారు. సోమవారం కూడా అటవీ ప్రాంతం కాలిపోతూ కనిపించింది. ప్రస్తుతం మల్లికార్జున కొండ నుంచి పెద్దకొండకు పాకింది. అటవీశాఖ అధికారులు కనీసం సందర్శించిన పాపాన లేదని స్థానిక ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర తెలిపారు.

కొండకు నిప్పు పెట్టిన ఆకతాయిలు..

కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని వన్నూరుస్వామి కొండకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కొండ కింద భాగంలో నిప్పు పెట్టడంతో కింద నుంచి మంటలు పూర్తిగా ఎగబాకాయి. భారీగా మంటలు కొండ మొత్తం చుట్టుముట్టాయి. కొండలోని చెట్లన్నీ పూర్తిగా కాలిపోయాయి.

నారాయణ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి

ఉరవకొండ: నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నందు, హారున్ రషీద్, ఏఐఎస్ఏ నియోజకవర్గ కన్వీనర్ భీమేష్ మండిపడ్డారు. సోమవారం నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేశారు. స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ అనంతపురం నారాయణ కళాశాలలో ఫీజులు కట్టలేదని విద్యార్థిని గంటల తరబడి బయట నిలబెట్టి అవమానానికి గురి చేశారన్నారు. మనస్థాపంతో విద్యార్థి కళాశాల భవనం నుంచికిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ అసమర్థడని, వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు మృతి చెందడం కలిచి వేస్తోందని చెప్పారని, ఇప్పుడేమో నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాజేష్, మనోజ్, అనిల్, ఎర్రిస్వామి, శివ, సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణ నైపుణ్యం అవసరం

ఉరవకొండ: విద్యార్థినులకు చదువుతోపాటు స్వీయ రక్షణ నైపుణ్యం అవసరమని ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం చిన్నముష్టూరు ప్రభుత్వ మోడల్ స్కూల్, ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల, పాత మార్కెట్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్వీయ రక్షణ నైపుణ్యత, మానసిక అప్రమత్తతపై ట్రైంట్నింగ్ స్లేప్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కరాటే మాస్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కరాటేపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశస్తకుమారి, జెడ్పీహెచ్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం అనితకుమారి, ఎస్టీ గురుకులం ప్రిన్సిపాల్ అరుణాకుమారి, సూపర్‌వైజర్లు రాజమ్మ, పద్మావతి, రబియా, రాజేశ్వరి, తిరుపాల్‌బాయి తదితరులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

బెళుగుప్ప: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని శాంతిధామంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు సురేఖ, అరుణ ఆధ్వర్యంలో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఏసీడీపీఓ ఎల్లమ్మతో కలిసి సీడీపీఓ మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ సక్రమంగా నిర్వహించాలన్నారు. పిల్లల్లో బరువు, ఎత్తులను కరెక్ట్‌గా తీసి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

సాగు భూములు ఖాళీ చేయాలని బెదిరింపులు



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: సాగు భూములు ఖాళీ చేయాలని అగ్రకులాలవారు బెదిరిస్తున్నారని నారాయణపురానికి చెందిన దళితులు, దళిత సంఘాల నాయకులు అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు విన్నవించారు. వారు మాట్లాడుతూ నారాయణపురంలో కొన్నేళ్లుగా దళితులు కొందరు ప్రభుత్వ శావాయి భూమి సర్వే నంబర్ 75లో 4.75 ఎకరాలు సర్పంచ్ తీర్మానంతో సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ తిమ్మప్ప దళితులు సాగు చేసుకుంటున్న భూమిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నట్లు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఇదే సర్వే నంబర్లో దళితులతో పాటు అగ్రకులాలకు చెందిన వారు, ప్రభుత్వ ఉద్యోగులు పట్టాలు పొందినట్లు ఆర్డీఓ వసంతబాబు దృష్టికి తీసుకొచ్చారు. దళిత, గిరిజన సంఘాల నాయకులు గురుమూర్తి, ఆర్‌కే రాజు, తిప్పేస్వామి నాయక్, చెలిమప్ప, సతీష్, వన్నూరుస్వామి, అంజి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 28న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు.

కుష్టు నిర్ధారణ సర్వే పక్కాగా చేపట్టాలి

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా కుష్టు నిర్ధారణ సర్వే, ఎన్‌సీడీ సర్వే, రాష్ట్రీయ బాల స్వాస్థ్యసర్వేలను వంద శాతం పక్కగా పూర్తి చేయాలని వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్ ఎంలు , ఎంఎల్‌హెచ్ పీలతో సమావేశమయ్యారు. హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి , ఏఎన్ఎంలు , ఎంఎల హెచ్ పీలు పాల్గొన్నారు.

మందకృష్ణ సేవలకు తగిన గుర్తింపు

కూడేరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ దళితుల హక్కుల సాధనకు చేసిన పోరాటాలకు, సామాజిక సేవలకు పద్మశ్రీ అవార్డుతో తగిన గుర్తింపు లభించిందని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. వీహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, కార్యదర్శి కృష్ణమూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఆధార్ కేంద్రాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

పశువుల వ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దు

కూడేరు: పశువుల వ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దని బోశసముద్రం, ఇప్పేరులో పశు వైద్యాధికారులు శ్వేత, శ్రీనివాసులు సూచించారు. సోమవారం జల్లిపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఏహెచ్ఏలు రాఘవ, ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, సర్దార్ బా షా, ఎల్ఎస్ఏ భాగ్యలక్ష్మి, రామాంజనేయులు, భవాని, య శోద, దామోదర్, గోపాల్ మిత్ర పాల్గొన్నారు.

పురాతన శివాలయం సందర్శన

కుందుర్పి: మండల కేంద్రంలోని పురాతన బొమ్మలనాయుడి శివాలయాన్ని సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ తిప్పేస్వామి తదితరులు సందర్శించారు. జిల్లా పురావస్తుశాఖ అధికారులతో మాట్లాడి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కంది పంటకు నిప్పు

బ్రహ్మసముద్రం : గొంచిరెడ్డిపల్లి– కొండాపురం గ్రామాల మధ్య సాగు చేసిన కంది పంటకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సంతే కొండాపురం రెవెన్యూ పొలంలోని రైతులు కె. లక్ష్మి అనే రైతుకు చెందిన రెండెకరాలు కందిపంట కాలిపోయింది. మరో రైతు సిద్ధలింగప్పకు చెందిన ఎకరం కంది పంట డ్రిప్ లాటరీ కాలిపోయింది.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: స్థానిక కేటీఎస్ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం, ఫోర్త్ సెమిస్టర్‌లో కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామమూర్తి సోమవారం తెలిపారు. ఎంఎస్‌ఈ, ఎంసీఏ, ఎంటెక్ కంప్యూటర్స్‌లో ఉత్తీర్ణత సాధించినవారు ఈ నెల 29న కళాశాలలో సంప్రదించాలన్నారు.

షబ్ ఏ మిరాజ్ ప్రార్థనలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని పలు మసీదుల్లో సోమవారం షబ్ ఏ మిరాజ్ ప్రార్థనలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి ఇషా నమాజ్ అనంతరం షబ్ ఏ మిరాజ్ ప్రాముఖ్యతను ఇమామ్‌లు వివరించారు. ప్రవక్త మహమ్మద్‌కు అల్లాహ్ ప్రసాదించిన అనుభవాల్లో షబ్ ఏ మిరాజ్ ముఖ్య ఘట్టమన్నారు.ప్రవక్త మార్గంలో నడుస్తూ అల్లా ప్రసాదించిన ఐదు పూటల నమాజ్ విధిగా చేసినప్పుడూ జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక



హెచ్.రాము, ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్షుడు



ఎన్.వంశీకృష్ణ, పట్టణ కార్యదర్శి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా హెచ్.రాము, ప్రధాన కార్యదర్శిగా ఎన్.వంశీకృష్ణ, ఉపాధ్యక్షులుగా దర్శన్, లోకేష్, మౌలారా, సహాయ కార్యదర్శులుగా మోహన్, అజయ్, కమిటీ సభ్యులుగా అభి, దేవరాజ్, వంశీ, భరత్‌ను ఎన్నుకున్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు



అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ నందకిశోర్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న ఎంపీడీఓ నందకిశోర్, టెక్నికల్ అసిస్టెంట్ పండరీష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు అవినాష్, మంజునాథ టైపిస్టు సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సురేష్ , ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.1,10 కోట్లతో ఆంజనేయస్వామి రథం

కుందుర్పి: అప్పిలేపల్లి బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి ఆలయానికి రూ.1.10 కోట్లతో ఆలయ కమిటీ, గ్రామస్తులు విరాళాలతో రథాన్ని తయారు చేయించారు. గతేడాది ఫిబ్రవరిలో రథోత్సవంలో భాగంగా రథాన్ని లాగుతుండగా రథం విరిగి కిందపడిపోయింది. దీంతో కర్ణాటక గదగ్‌లో నూతన రథాన్ని తయారు చేయించి ఆదివారం రాత్రి గ్రామానికి తీసుకువచ్చినట్లు సర్పంచ్ అతావుల్లా తెలిపారు.

కుడి కాలువ బ్రిడ్జికి గండి

కూడేరు: మండలంలోని జల్లిపల్లి గ్రామ సమీపాన వెళ్లిన ధర్మవరం కుడి కాలువ బ్రిడ్జికి గండి పడడంతో నీరు వృథాగా పోతోంది. ఈ నీరంతా కుడి కాలువ పక్కన ఉన్న పొలాల్లోకి పారుతోంది. పీఏబీఆర్ డ్యాం నుంచి ధర్మవరం కుడికాలువకు గత నెల 2న నీరు విడుదల చేశారు. నీరు వృథాగా పోతుండడంతో పంటలు సాగు చేసుకోలేకపోతున్నామని రైతులు వాపోయారు. సంబంధిత ఉన్నతాధికారులు బ్రిడ్జికు పడిన గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL CIVIL JUDGE AND JMFC AT BALLARI

CRL.MC.NO.62 OF 2024

Between:
Bhaskar Reddy and others ... Petitioners
AND
The Tahsildar cum Registrar of Births and Deaths, Taluk Office, Ballari ...Respondent

NOTICE

To, **1) The Tahsildar cum Registrar of Births and Deaths Taluk Office, Ballari. 2) Rajeshwari,** W/o. Late Prabhakar Reddy, aged about 47 years, Housewife, R/o. H.No. 9, Vaddara Oni, P.D Halli Village, Ballari Taluk and District. **3) Mallikarjuna Reddy,** S/o. Late Nagireddy, aged about 51 years, R/o. H.No. 9, Vaddara Oni, P.D Halli Village, Ballari Taluk and District. **4) Smt. V. Rathnamma** W/o. V. Nagaraj Reddy, D/o. Late Nagireddy, aged about 43 years, R/o. Mallikethi, Pulakurthi Village, D.Hirehal Mandal, Ananthapur District. **5) Sheshadri Dhanalakshmi** W/o. Sheshadri Raghunath Reddy, D/o. Late Nagireddy, aged about 45 years, R/o. H.No. 2/33, O.C. Colony, Somalapuram Village, Kanekal Mandalam, Ananthapur District.

Whereas the above named petitioners have filed application against the respondent seeking death certificate of petitioner so Nagireddy, S/o. Malla Reddy who died on 09.10.1991 at above Paramadevanahalli Village, Ballari Taluk and District.

You are hereby summoned to appear in this court in person or by an Advocate duly instructed and able to answer all material questions relating to the claim or who shall be accompanied by some person able to answer all such questions, on the day **28-02-2025 at 11-00** 'O' Clock in the forenoon, to answer the claim And further you are hereby directed to file on that day a counter of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base. Your defense, where you rely on any other document whether in your possession or power or not, as evidence in support of your defense you shall enter such documents in a list to be annexed to the counter).

Take notice that, in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

Given under my hand and seal of this court on this **23rd day of January 2025** at Hosapete.

By Order of the Court

BHUVANESHWARI GURUVINA
Advocate for the Petitioners, Place: Ballari.
Chief Administrative Officer,
Hon'ble IV Civil Judge and JMFC, Ballari.